# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | సోమవారం, డిసెంబరు 29, 2025 | సంపుటి:11 | సంచిక : 250 | పేజీలు: 4 | వెల : రూ.5





2లో

**ప్రగతినగర్ చెరువుకు పునరుజ్జీవం**

104 లారీల చెత్తను తొలగించిన హైడ్రా

సెలవుల్లోనూ కొనసాగిన పనులు

# డెస్క్ జర్నలిస్టులందరికీ పూర్తిస్థాయిలో న్యాయంచేస్తాం

### బస్ పాస్ లతో సహా ఇతర అన్ని సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయిస్తాం
### అవాస్తవాలతో కొందరు తప్పుద్రోవ పట్టిస్తున్నారు
### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



హైదరాబాద్, డిసెంబర్ 28,నవతరం: జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్ లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్ లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు.ఆదివారం బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ముఖ్యుల సమావేశానంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్ లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నానాటికి జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జీవోను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని, అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డులు ఎంతవరకు పని చేశాయో, దానికి కారణం ఎవరన్నది ప్రతి జర్నలిస్ట్ కు తెలుసునన్నారు. జర్నలిస్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు జర్నలిస్టులకు మేలు జరుగుతోందంటే ఓర్చుకోలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేసే ఏ సంస్థలకైనా, ఏ సంఘాల కైనా టియుడబ్ల్యూజే మద్దతు ఉంటుందని, అయితే ఆ పోరాటం సహేతుకమైనది అయి ఉండాలన్నారు. 252 జీవో తో 13వేల అక్రిడేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, అప్పటి తమ సంఘం ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రిడిటేషన్లు ఇప్పించిన చరిత్ర తమకు ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రిడిటేషన్ లను 12వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు , పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు. కార్డుల సంఖ్య ముఖ్యం కాదని, ఆ కార్డులతో ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసారో, వాటి కోసం ఎన్ని ఉద్యమాలు చేసారో చెబితే బాగుంటుందన్నారు. 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్ తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కే.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సీఈవో అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎన్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జీవో వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ ఛైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రామచంద్ర మూర్తి కమిటీ సిఫార్సులకు భిన్నంగా తీసుకువచ్చిన 239 జీవో తో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే అప్పటి మీడియా అకాడమీ ఛైర్మన్, ఆయన సంఘం ఎందుకు నోరెత్తలేదన్నారు. ఆ జీవోతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500అక్రిడిటేషన్ కార్డులు తొగించబడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణకు చెందిన యాజమాన్యాలు స్థాపించిన రెండు ప్రధాన పత్రికలకు అక్రిడిటేషన్లను అడ్డుకున్నది ప్రస్తుతం ఆందోళన చేస్తున్న సంఘమేనని విరాహత్ ఆరోపించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్ ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘనిదే అని ఆయన గుర్తుచేసారు. అయితే గతంలో రాష్ట్రంలో జారీచేసిన దాదాపు 3 వేల అక్రిడిటేషన్ కార్డులు జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో ఉన్నట్లు తమ సంఘానికి అందిన ఫిర్యాదుల్లో తేలిందన్నారు. అడ్డదారుల్లో అక్రిడిటేషన్లు పొందిన వారే జర్నలిస్టులుగా చలామణి అవుతూ, ఇసుక వ్యాపారులను, రైస్ మిల్లర్లను, బిల్డర్లను, ఇతర వ్యాపారులను బెదిరిస్తూ పోలీసులకు చిక్కారని, వారిపై కేసులు నమోదు కావడం జర్నలిజం విలువలను మంటగలిపిందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఓ గ్రామ సర్పంచ్ గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో పనిచేసే బాయ్ కి కూడా ఓ పత్రికా బ్యూరో కార్డు అందించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పద్దతుల్లో అక్రిడిటేషన్ కార్డులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు, వాటికీ గౌరవం దక్కించే ఉద్దేశంతోనే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో 252 జీవో ను తెచ్చారని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులతో రిపోర్టర్లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఏలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి, అక్రిడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓ లో ఉన్న కొన్ని లోటు పాట్లను తాము గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జీవో జారీ చేసిందన్నారు. అయితే ఆస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు అందిన సంక్షేమ పథకాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యారి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు కెసిఆర్ అసెంబ్లీకి..
## పెరిగిన పొలిటికల్ హీట్

**తెలంగాణ, డిసెంబర్ 28,నవతరం: నేటి నుంచి (డిసెంబర్ 29) ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజే బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారు. ఇందుకోసం ఆదివారం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కేసీఆర్ అసెంబ్లీకి రానుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.**

## సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టాలి



హైదరాబాద్, నవతరం: అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపధ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252పై రాష్ట్రవ్యాప్తంగా టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంత్రులను, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు వినతిపత్రాలు ఇవ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ వివరించారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం టియూడబ్ల్యూజే (హెచ్%-%143) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవో నంబర్ 252పై ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు తెలిపిన నేపథ్యంలో దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా కమిటి నిర్ణయిందన్నారు. ఇందులో భాగంగానే ప్రజా ప్రతినిధులకు మొదటగా వినతి పత్రాలు ఇచ్చి, అసెంబ్లీలో వారు చర్చించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. జీవో 252 కారణంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టాలని నిర్ణయిస్తూ, ప్రభుత్వంతో చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం రావాలని, లేనిపక్షంలో పోరాట మార్గాన్ని అనుసరిస్తామన్నారు. జీవో 252 సవరించేవరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. డెస్క్ జర్నలిస్టులకు రెండు కార్డుల విధానాన్ని తెచ్చి తీరని అన్యాయం చేసిందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పెద్ద పేపర్లతో పాటు మధ్య చిన్న తరహా పత్రికలకు, శాటిలైట్ చానల్స్ కు పెద్ద సంఖ్యలో కార్డులు తగ్గించడం, కేబుల్ చానల్స్ కు రాష్ట్ర స్థాయిలో అసలు కార్డు లేచి లేకుండా చేయడం జీవో ఉద్దేశాన్ని అర్థం చేస్తుందని అన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరిగే ఇలాంటి జీవో సవరణ చేయడం గానీ, నూతన జీవో తీసుకురావడం గాని ఈ ప్రభుత్వం వెంటనే చేయాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది మార్చి నెలలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభ నిర్వహించి పూర్తి స్థాయి కమిటీ వేసునున్నట్లు ఆయన వివరించారు. ఆప్పటివరకు మిగిలిన కొన్ని జిల్లాలలో పూర్తిస్థాయి కమిటీ లు వేసుకోవాలని సూచించారు. ఇళ్ల స్థలాల సమస్యపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. చిన్న పత్రికల ఎంప్యానల్మెంట్ సమస్య పరిష్కారం కోసం సమాచార శాఖ భవన్ ముట్టడి కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం 'తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ట్రస్ట్' ప్రారంభించామని ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ మాట్లాడుతూ, జీవో 252ను స్పష్టత లేకుండా జర్నలిస్టు యూనియన్లతో సంప్రదింపులు జరపకుండా విడుదల చేశారని ఆరోపించారు. గతంలో జీవో 239 రూపకల్పన సమయంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాజా జీవో 252లో ఆ స్ఫూర్తి పూర్తిగా లోపించిందన్నారు. ప్రస్తుత నిబంధనల కారణంగా సుమారు 13 వేల అక్రిడేషన్ కార్డులు రద్దయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, ఇది జర్నలిస్టుల వృత్తి భద్రత, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అక్రిడేషన్ కార్డుల దుర్వినియోగంపై కఠిన చర్యలు అవసరమేనని, అయితే అర్హులైన జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని వారు స్పష్టం చేశారు. ప్రధాన జర్నలిస్టు యూనియన్ల అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మీడియా అకాడమీ పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ హాజారీ, కోశాధికారి యోగానంద్, రాష్ట్ర టెంజు అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శి రమణ, ఐజేయూ జాతీయ నాయకులు భాస్కర్, తిరుపతి నాయక్, రాష్ట్ర నాయకులు గుండు ముత్తయ్యగౌడ్, సుధాకర్, లెనిన్, రాజ్ నారాయణ, రాంగోపాల్, సి హెచ్ .సుధాకర్,నవీన్ కుమార్ యారా తో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జర్నలిస్టులు హాజరయ్యారు.



## హైదరాబాద్ నగరంలో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్, డిసెంబర్ 28,నవతరం : సోమాజిగూడలోని ఆల్ పైన్స్ అపార్టుమెంటులో 5వ అంతస్తులో సిలిండర్ బ్లాస్ట్ కావడంతో భారీగా చెలరేగిన మంటలు, భయంతో బయటకు పరుగులు తీసిన నివాసితులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, మంటల్లో చిక్కుకున్న కుక్కపిల్లను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది.**

## జనంలో ఉంటేనే మనుగడ..

### తండ్రి బాటలో కవిత.. గిరిజన తండాలో నిద్ర
### రాజకీయంగా ఆటుపోట్లు సహజం
### నిత్యం ప్రజల్లో ఉంటేనే నాయకులుగా ఎదుగుతారు



కొల్లాపూర్, డిసెంబర్ 28,నవతరం: రాజకీయంగా సొంత కుటుంబంతో విబేధాలు వచ్చి అమ్మలాంటి పార్టీని వీడాల్సి వచ్చినపుడు.. విమర్శలు చేస్తూ ఆవేదనలు వ్యక్తం చేస్తూ కూర్చుంటే కుదరదు.. ప్రజాక్షేత్రంలోకి వెళ్ళాలి.. దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతూనే ఉండాలి... ఓటమి రావచ్చు.. ఒకసారి కాదు పదిసార్లు రావచ్చు.. కానీ ఆతర్వాత అయినా విజయం వస్తుంది... ప్రజలు ఆదరించడం లేదని రాజకీయాలకు దూరమైన వారు.. మొత్తంగా కనిపించకుండా పోయారు.. ఏటికి ఎదురీదుతున్నట్లు పరిస్థితులు ఉన్నా.. ముందుకే సాగిపోవాలి.. పనై పోయింది అనేవాళ్లే.. పంచన చేరుతారు.. అలాంటి దృఢ సంకల్పం నేడు కవితలో కనిపిస్తోంది.. ఒక చోట ఒక్కరుకూడా జనం బాటకు హాజరు కాలేదు.. అయిన ఆమె నిరాశపడలేదు.. ముందుకు సాగిపోతున్నారు..విమర్శలు ఆరోపణల జడివానలు కురుస్తున్నా.. వాటిని అధిగమిస్తూ దీక్షగా ముందుకు నడుస్తున్నారు.. జనంతో కలుస్తూ జనాల్లో ఉండే ప్రయత్నం చేస్తున్నారు...

**గిరిజన తండాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలి బస**

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తర్వాత తండాలో బస చేస్తున్న రెండో లీడర్ కల్వకుంట్ల కవిత**

జాగృతి జనంబాటలో భాగంగా శనివారం నగర్ కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో పర్యటించిన కవిత శనివారం రాత్రి కల్వకుర్తి నియోజకవర్గంలోని సలార్ పూర్ తండాలో తెలంగాణ జాగృతి యూత్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి రాథోడ్ నివాసంలో బస చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ ఉద్యమం లో భాగంగా గిరిజన తండాలో బస చేసిన కేసీఆర్ సామాజిక తెలంగాణ సాధన కోసం ఉద్యమిస్తున్న కవిత ఈక్రమంలో జాగృతి జనంబాట యాత్ర తలపెట్టారు. గిరిజన తండాలో బస చేసిన మొదటి మహిళా నాయకురాలిగా కవిత కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. తండాలో బస చేసి గిరిజకుల సమస్యలు దగ్గరి నుంచి చూసి అవగతం చేసుకోనున్న జాగృతి అధ్యక్షులు.

# నువ్వా నేనా... వేరేవారికి అవకాశమా!



నవతరం, శ్రీకాకుళం: పాలక, ప్రతిపక్షాలు రెండు కలిసి పని చేయడం అరుదుగా చూస్తుంటాం. నేడు శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో ఏ ఇద్దరు కలిసి మాట్లాడుకుంటున్న ఇదే చర్చ జరుగుతోంది. భరత్ అనే నేను సినిమాలో పాలక ప్రతిపక్షాలు కలిసి పనిచేయడం చాలా అరుదుగా జరుగుతుంది....! అని ఆ సినిమాలో ఇన్వెస్టిగేషన్ జర్నలిస్టు మహేష్ బాబుతో చెప్పడం జరుగుతుంది. అదే విధంగా తల్లి కాంగ్రెస్ పాలన నుండి జిల్లాలో పాలక ప్రతిపక్షాలు అంటే నాడు తెలుగు దేశం పార్టీ, కాంగ్రెస్ కాగా నేడు వైఎస్ఆర్ సిపి, తెలుగు దేశానికి చెందిన ప్రజాప్రతినిధులు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడం విశేషం. ఈ జిల్లాలో మరో బలమైన సామాజిక వర్గం ప్రజాప్రతినిధులను అణగదొక్కాలని చూడడమే కాకుండా వారి ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఉండదు, ఉండకూడదు అని సుదీర్ఘ కాలముగా కొనసాగుతున్న తంతేనని చెప్పుకోవడం విశేషం. అయితే ఈ నేపద్యంలో నిజమే అని కూడా కొన్ని సంఘటనలు పరిస్థితులు రుజువు చేశాయని కూడా కొంతమంది డంకా పదముగా చెప్పటం వెనుక బలమైన కారణాలు ఏమిటి అన్నది పది రకాలుగా గతం నుండి కూడా చర్చించుకోవడం జరుగుతూనే ఉంది. ఈ తరుణంలో బలమైన సామాజిక వర్గానికి ప్రాధాన్యత దక్కకుండా దశాబ్దాలుగా కూడా ఆణతొక్కేస్తున్నారని వారి కను సన్నలలో మాత్రమే ఉన్నటువంటి ఇతర వ్యక్తులకు ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారికి తప్ప వారిని వ్యతిరేకించిన వారికి సమర్థులకు ఎట్టి పరిస్థితులలోనూ ముందుకు రానివ్వరు ఆయన వాదన రెండు దశాబ్దాలుగా దువ్వాడ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. మరో సామాజిక వర్గానికి అవకాశం లేకుండా చెయ్యడంలో సఫలమైయారని దువ్వాడ మాటలలో విన్నాం. అయితే దువ్వాడ మాటల్లోనే కాదు. జిల్లాలో కాంగ్రెస్ పాలన నుండి ఈ మాటలు వినిపిస్తున్నాయి. జిల్లాలో నేటి పాలక పక్షం వలన ఎలాంటి లాభాపేక్ష లేకపోయినా జిల్లాలో ఆపార్టీ నేతల మూలంగానే ప్రజలు బతికి బట్టకట్టినట్టే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ బలమైన సామాజిక వర్గం కాలింగలు వారికి రాజకీయంగా ప్రాధాన్యత తక్కవనే చెప్పాలి. తరువాత తెలగ సామాజిక వర్గానికి చెందినవారు ఒకప్పుడు కర్నూలు రాజధానిగా ఉన్న రోజులలో స్పీకర్ గా పనిచేసిన రొక్కం లక్ష్మీనారాయణ దొర వారి సోదరులు శాసనసభ్యులుగా రామ్మూర్తి దొర మరియు కాంగ్రెస్ పార్టీ లో త్రిపురాణ రాఘవ దాసు జిల్లా అధ్యక్షులుగా డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గాను పనిచేసే ఫ్రీడమ్ ఫైటర్, ఆయన కుమార్తె త్రిపురాన వెంకటరత్నం శాసనసభ్యురాలుగా మరియు కొద్ది కాలం మంత్రిగా తెలుగుదేశం పార్టీలు నందమూరి తారక రామారావు హయాంలో ప్రధాన కార్యదర్శి గాను చేయటంతో పాటు, మహిళా కమిషన్ చైర్మన్గా కూడా ఆవిడ పదవులు చేపట్టారు. ఆమె సోదరులు త్రిపురాణం రవీంద్ర దాసు తన సామాజిక వర్గానికి నాయకత్వం వహిస్తూనే ఎల్లంపేట మండలంలో వట్టి చేతితో చక్రం తిప్పే సమర్ధుడుగా చెప్పుకోవడం విశేషం అదే విధముగా కోటబొమ్మాలి మండలంలోని దంత పంచాయతీని తాను ఉన్నంతవరకు తన చెప్పు చేతుల్లోనే ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఉంది అని స్థానిక ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంటారు. అదేవిధంగా వైయస్సార్ పార్టీ లో 2014 19 మధ్యకాలంలో రొక్కం సూర్యప్రకాశరావు జిల్లా అధికార ప్రతినిధిగా ఒకే ఒక్కడు అన్నట్టు ప్రతిపక్ష పాత్రను నిర్భయముగా బాధ్యతగా వివరణాత్మక సమస్యలతోనూ పాలక పక్ష తప్పిదాలను ఎండగడుతూ తనదైన శైలిలో ప్రతిపక్షానికి వెన్నులో వణుకు తెచ్చే విధముగా బాధ్యతగా రాష్ట్రస్థాయిలో ప్రతిపక్షాన్ని గుర్తింపు తెచ్చే విధంగా పనిచేశారని చెప్పుటకు అతిశయోక్తి లేదు. తదనంతరం ఏదో కారణాలతో తాను తాత్కాలికంగా పార్టీ మారటం తర్వాత మరల పార్టీలు చేరటం కొన్ని కారణాల వలన తనకు సరైన గౌరవం దక్కడం లేదు దానిని కి ఉన్న సమస్యలు పరిష్కరించి అధిష్టానం తగు విధముగా గుర్తించి ప్రాధాన్యత లేకపోవడం వలన నేటికీ పార్టీలోనే ఉన్న తటస్థంగానే ఉండిపోయారు అన్నది వాస్తవం. నిజానికి ప్రతిపక్షాన్ని బ్రతికించి నిర్భయముగా వాస్తవాలను అందించి చక్కనైన వాగ్దాటితో వివరణాత్మకంగా పాలకపక్షాల లోపాలను తప్పిదాలను నివేదించగలిగిన సమర్థత ప్రజా ఆకర్షణ కలిగిన ముఖ్యమైన వ్యక్తి రొక్కం సూర్యప్రకాశరావు అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. కానీ మైనారిటీ అనే ఒక అడ్డుగోడ ఆయనని అడ్డుకుంటుంది అన్నది కూడా నిజమే. ఈ నేపథ్యంలో నేటి ప్రజాస్వామ్య రాజకీయాలు కుల వ్యవస్థ బలపడి సమర్థత, సేవ, ప్రాధాన్యతలు బలహీన పడుతున్న క్రమములో అందుకు ఏమో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రజలకు న్యాయం చేయలేక కొన్ని వర్గాలకు తగు ప్రాధాన్యత ఇవ్వకపోవడం మరియు అర్హత ఉన్నప్పటికీ కొన్నింటిని పొందలేకపోవడం జరుగుతుందేమో అని రాజకీయం పరిశీలకులు విజ్ఞులు మేధావులు నేడు ఇక్కడ అక్కడ అనకుండా ఆందోళన చెందవలసిన పరిస్థితి బలపడి ఉందని చెప్పక తప్పదు. శ్రీకాకుళం జిల్లా వరకు వస్తే దువ్వాడ సమస్య పక్కన పెడితే రెండు బలమైన సామాజిక వర్గాలు నాలుగు దశాబ్దాలుగా పూర్తిస్థాయిలో రాజకీయ ప్రాధాన్యత క్రమంలో ఉన్నప్పటికీ జనాభా ప్రాతిపదికన అధిక జనాభా కలిగిన సామాజిక వర్గానికి సరైన ప్రాధాన్యత దక్కడం లేదని వాదన మాత్రం అది అప్పటినుండి ఇప్పటివరకు కొనసాగుతూనే ఉన్నది. కారణాలు ఏమో కానీ ఈ వాదనలు మాత్రం చర్చనియాంసముగానే ఉన్న మాట వాస్తవమే. ఈ నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీలైన నిబద్ధతగా ప్రజలకు చెరువవ్వాలి అన్నివర్గాలను ఏకతాటిపై తెచ్చి ముందుకు కొనసాగాలి అనుకున్నప్పుడు మాత్రం ఈ వివక్షతలు విడనాడి సమర్థత, చాకచక్యం దృష్టిలో పెట్టుకొని అందరికీ సమన్యాయం సమధర్మం సామాజిక న్యాయం అనే కోణంలో రాజకీయ పార్టీ పదవులలో గాని ప్రజా ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని పరిపాలనను అందించినప్పుడు సంబంధిత వర్గాల అన్నింటిని న్యాయం చేసే విధముగా ముందుకు సాగితే విభేదాలు లేని ప్రశాంతమైన విధముగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన రాజకీయ వాతావరణం కొనసాగుతుంది. పాలకులకు రాజకీయ పార్టీలకు వివక్షత ఉండదని అందరినీ సమదృష్టితోనే చూసి ఆదరిస్తారని అది ఆచరిస్తారని ఆశిద్దాం.

# రాజ్యాంగం కాదు! రెడ్‌బుక్ పాలన?



నవతరం: విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులో ఉందా? లేక చంద్రబాబు నాయుడు రూపొందించిన 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందా? అన్న ప్రశ్న నేడు ప్రతి పౌరుడిని వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. చట్ట పాలన స్థానంలో రాజకీయ ప్రతీకారాలు, ప్రజాస్వామ్యం స్థానంలో అణచివేతలు పరిపాటిగా మారాయి.

### ప్రతిపక్షాలపై కక్ష సాధింపు
### తప్పుడు కేసుల పరంపర

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై తప్పుడు కేసుల వరద మొదలైంది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పదే పదే జైల్లో పెట్టి, ఆయన కుటుంబ సభ్యులపై కూడా కేసులు బనాయించారు. వల్లభనేని వంశీ, జోగి రమేష్ కుటుంబం, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పేర్ని నాని, కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి సహా అనేక మంది నేతలపై ఒక కేసు ముగియగానే మరో కేసు పెట్టే రాజకీయ కక్ష స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి గుదిబండ కాదా?

### మహిళలకు రక్షణ కరువు అఘాయిత్యాల ఆంధ్రప్రదేశ్

చంద్రబాబు పాలనలో మహిళలు, బాలికలకు భద్రత లేకుండా పోయింది. 2025 ప్రారంభం నుంచే రాష్ట్రవ్యాప్తంగా పోక్సో కేసులు, సామూహిక అత్యాచారాలు, బాలికల హత్యలు షాకింగ్ స్థాయిలో పెరిగాయి. చిన్నారులపై లైంగిక దాడులు, పాఠశాలల పరిధిలోనే జరుగుతున్న అకృత్యాలు, ప్రభుత్వ ఆస్పత్రుల వరకు చేరిన దారుణాలు రాష్ట్రాన్ని వణికిస్తున్నాయి. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే – ఈ కేసుల్లో టీడీపీ కార్యకర్తలు, నేతల అనుచరుల పేర్లు రావడం. అయినా ప్రభుత్వం స్పందించడంలేదు.

### హోంమంత్రిత్వ శాఖ నిర్వీర్యం

రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే హోంమంత్రి వంగలపూడి అనిత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. “నేను లాఠీ తీయాలా? తుపాకీ తీయాలా?” అంటూ చేసిన వ్యాఖ్యలు మహిళా భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీకగా మారాయి.గంజాయి %–% డ్రగ్స్: ఎన్నికల హామీలు మరిచిపోయారా? “వంద రోజుల్లో గంజాయిని నిర్మూలిస్తాం” అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ ప్రజలను మభ్యపెట్టారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచిపోయారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా విజృంభిస్తోంది. యువత జీవితాలు నాశనం అవుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది.పోలీసు రాజ్యం కోర్టుల హెచ్చరికలు బేఖాతరుకూటమి ప్రభుత్వంలో పోలీసులు చట్టానికి కాకుండా అధికార పార్టీ ఆదేశాలకు లోబడి పనిచేస్తున్నారని హైకోర్టు పలుమార్లు తీవ్రంగా వ్యాఖ్యానించింది. అక్రమ అరెస్టులు, హెబియస్ కార్పస్ పిటిషన్లు, కోర్టు ఆదేశాల ఉల్లంఘనలు నిత్యకృత్యమయ్యాయి. “కోర్టుల కన్నా ఎక్కువ అనుకుంటున్నారా?” అంటూ హైకోర్టు ప్రశ్నించాల్సి రావడం ఈ ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోంది.

### ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు - నిజాల దాచివేత

ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని కప్పిపుచ్చేందుకు టీడీపీ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయి. జరిగిన దారుణాలను వక్రీకరించడం, బాధితులనే నిందించడం, మహిళలపై సైబర్ వేధింపులు చేయడం ఈ పాలనలో సాధారణమయ్యాయి.

### ముగింపు: భయపాలనకు చెక్ పెట్టాలి

చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ భయపాలనకు నిలయంగా మారింది. రాజ్యాంగ పాలనకు బదులు రెడ్ బుక్ పాలన, న్యాయానికి బదులు ప్రతీకారం, భద్రతకు బదులు భయం – ఇదే నేటి రాష్ట్ర పరిస్థితి. ప్రజల ప్రాణాలు, మహిళల గౌరవం, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించింది. ఈ పాలనపై ప్రజలు ప్రశ్నించే రోజు దగ్గర్లోనే ఉంది. అని మీడియా సమావేశంలో చపసుపులేటి సురేష్‌లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియాప్యానలిస్ట్ ఆవేదనతో తెలియజేశారు.

# ప్రగతినగర్ చెరువుకు పునరుజ్జీవం

## 104 లారీల చెత్తను తొలగించిన హైడ్రా
## సెలవుల్లోనూ కొనసాగిన పనులు

హైదరాబాద్, నవతరం: సకల జీవకోటికి ప్రాణాధారంగా ఒకప్పుడు పేరుగాంచిన ప్రగతినగర్ (అంబీర్) చెరువు ఆనవాళ్లు కోల్పోయింది. నగరీకరణలో పరిసరాలన్నీ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోగా.. వ్యర్థాలకు నిలయంగా మారింది. చికెన్, మాంసం, చేపల వ్యర్థాలతో దుర్గంధభరితమైంది. దీంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సహజత్వాన్ని కోల్పోయిన చెరువుకు పునరుజ్జీవం ఇవ్వాలని స్థానికులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలిసారు. ఫర్ ఎ బెటర్ సొసైటీ ప్రతినిధులు కూడా ఇందులో ఉన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు కూడా చేశారు. కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు వెనువెంటనే అక్కడ పరిస్థితిని పరిశీలించి రంగంలోకి దిగింది హైడ్రా. ముందుగా చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకుంది. చికెన్ వ్యర్థాలు వేయడానికి వచ్చిన 4 వాహనాలను హైడ్రా పట్టుకుంది. చెత్తను తొలగించే పనులను పెద్దయెత్తున చేపట్టింది.

### సెలవుల్లోనూ ఆగని పనులు..

క్రిస్మస్ పడంగతో పాటు.. వారాంతం సెలవులున్నా హైడ్రా పనులు కొనసాగిస్తూనే వచ్చింది. 5 నుంచి 6 లారీలు, 3 జేసీబీలతో చెత్తను తొలగిస్తోంది. ఆపరేషన్ అంబీర్ చెరువు మాదిరి పనులు చేస్తూ.. శనివారం వరకూ 104 లారీల చెత్తను హైడ్రా తరలించింది. చెరువు ఒడ్డున గుట్టలుగా చెత్త పేరుకుపోయిందని.. .. మరో వంద లారీలకు పైగా ఉంటుందని అక్కడ పనులు చేపట్టిన అధికారులు చెబుతున్నారు. కూకట్‌పల్లి – ప్రగతినగర్‌లను కలుపుతూ ప్రగతినగర్ చెరువు మధ్యలోంచి వేసిన రోడ్డుకు ఇరువైపులా పూర్తిగా చెత్తను తొలగించాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ చిరు వ్యాపారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ స్థలంలో అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ ఎంసీ, రెవెన్యూ అధికారులతో సమన్వయంతో పని చేస్తున్నారు. చెత్తను పూర్తిగా తొలగించి.. ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించింది.

### హైడ్రాతో చేతులు కలిపిన స్థానికులు

ప్రగతినగర్ చెరువు ఆహ్లాదకర వాతావరణాన్ని అనుభవించిన స్థానికులు హైడ్రాతో చేతులు కలిపారు. చెరువులోంచి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం స్థలం చూపించాలని కోరుతున్నారు. ఈ మేరకు జీహెచ్ ఎంసీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకు తమ సహకారం ఉంటుందని చెబుతున్నారు. తర్వాత చెత్త వేయడానికి వీలు లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రగతినగర్, నిజాంపేట్, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటిని ప్రగతినగర్ చెరువుకు చేరకుండా చర్యలు తీసుకోవాలని.. ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల)లతో చెరువుకు మంచినీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





## అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల జనరల్ బాడీ మీటింగ్ సమావేశం

నవతరం: గంగవరం.. (గాజువాక) : అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు సమస్యల పైన ఈరోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు జనరల్ బాడీ మీటింగ్ సమావేశం జరిగింది. ఈయొక్క సమావేశంలో రెండు మూడువిషయాలపైన కీలకమైన తీర్మానాలు చేయడం జరిగినది. ఒకటే ఎవరైతే ఇన్కమ్ టాక్స్ పెట్టుకున్న వారు రిజెక్ట్ అయిన వారు వెంటనే వారు మేనేజ్మెంట్ ఆడిటర్లతోమళ్ళీ చేయించుకోవడం, రెండోది ఇన్కమ్ టాక్స్ చేసుకోవడంలో కటింగ్ అయినా బ్యాలెన్స్ డబ్బులు కోసం5వ తారీఖున గౌరవనీయులైన శ్రీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గారితో మేనేజ్మెంట్ సమావేశమై ఈ యొక్క కటింగ్ అయిపోయిన డబ్బులు సమస్య పరిష్కరిస్తామని తీర్మానం చేయడం జరిగినది.....!... కీలకమైన తీర్మానంఈనెల 31 నేటి ముట్టడి మహాధర్నాన్నికార్మికులు అభిప్రాయం మేరకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గారు అభిప్రాయాన్ని మాటనిగౌరవించే విధంగా వాయిదా వేయడం జరిగినది. మాయొక్క కార్మిక సమస్యలు పరిష్కారంకానీఎడల తీవ్రమైన పరిణామాలకు పూర్తి బాధ్యత చఅదానీ గంగవరం పోర్టు మేనేజ్మెంట్చ ఇదే అని ఈ యొక్క మీటింగ్ లో జరిగిన సారాంశాలు పత్రికా ప్రకటన మరియు వాట్సాప్ గ్రూప్ ద్వారాగా ప్రజలకు ప్రతీ కార్మికుడు కుటుంబ సభ్యులకు పంపించడం జరుగుతున్నది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు గంటిపిల్లి అమ్మోరు(సలీమ్..మాద అప్పారావు..కదిరి సత్తయ్య..కదిరి సత్యారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అప్పలరాజు, మోటూరు రాము, చీకటి అప్పారావు, ఓలేటి అప్పలరాజు మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## అర్బన్ నక్సల్స్‌కూ ముప్పే - ఎన్ఐఏ కేసులు !

హైదరాబాద్, డిసెంబర్ 28,నవతరం: మావోయిస్టులకు మద్దతుగా మాట్లాడుతూ.. సానుభూతిపరులుగా, మేధావులుగా చెలామణి అయ్యే వారికి ఎన్ఐఏ గట్టి షాక్ ఇవ్వబోతోంది అలాంటి వారిని అర్బన్ నక్సల్స్ కేటగిరీలో చేర్చి అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే చాలా మందికి నోటీసులు వెళ్లాయి. సోషల్ మీడియా ఖాతాలను వెట్టింగ్ చేసి.. నక్సల్స్ కు మద్దతుగా ఉంటున్న వారిని అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### తాము హాయిగా ఉంటూ రెచ్చగొట్టే వాళ్లే అర్బన్ నక్సల్స్

ఓ వైపు మావోయిస్టుల పేరుతో కొంత మంది కుటుంబాలను వదిలేసి అడవుల్లో ఉంటే.. సిటీల్లోఉండే కొంత మంది వారి మద్దతుదారులమని మేధావులమని చెప్పుకునేందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఉంటారు. ఎన్ కౌంటర్ అయినప్పుడు మీ త్యాగం మరువదు.. ఒక్క హిడ్మాను ఎన్కౌంటర్ చేస్తే వంద మంది హిడ్మాలు వస్తారు..అని ప్రతిజ్ఞ చేస్తూ ఉంటారు. అంతేనా.. ప్రతీకారం తీర్చుకుంటామని..తామే స్వయంగా మావోయిస్టులం అయినట్లుగా ప్రకటనలు చేస్తూంటారు. ఇలాంటి అర్బన్ నక్సల్స్ సంగతి కూడా తేల్చాల్సి ఉందని ఎన్ఐఏ గుర్తించినట్లుగా తెలుస్తోంది.

### ప్రజా జీవితంలోకి రావడానికి అన్ని అవకాశాలు కల్పించిన ప్రభుత్వాలు

మావోయిస్టు ఉద్యమం ఫెయిలయింది. ప్రజాదరణ కోల్పోయింది. అకారణంగా ప్రజల్ని, రాజకీయ నేతల్ని, పోలీసుల్ని చంపడం వల్ల.. వారిని ఎన్ కౌంటర్ చేస్తే ఎవరూ స్పందించలేని పరిస్థితి వచ్చింది. ఇలాంటి సమయంలో కేంద్రం.. దేశ అంతర్గతభద్రతాసవాళ్లను పరిష్కరించేయాలని నిర్ణయించుకుంది. మావోయిస్టులందరికీ లొంగిపోయే అవకాశం కల్పించింది.ప్రజా జీవితంలోకి వచ్చే వారికి .. కేసులు లేకుండా బతకడానికి సాయం చేసేందుకు అంగీకరించింది. అయినా మాది తుపాకీ గొట్టమే.. కనిపించిన వాళ్లను కాల్చేస్తాం అన్న వారిని మాత్రమే వేటాడుతున్నారు. వారిని అలా వదిలేస్తే మరెన్నో ప్రాణాలు బలి తీసుకుంటారు. విజయవాడలో నక్సలైట్లు దొరికినప్పుడు.. వారు ఓ ప్రముఖుడ్ని అంతమొందించడానికి ప్లాన్ చేశారన్నదానికి ఆధారాలు లభించాయని ప్రచారం జరిగింది. దీనికి ఎవరు సమాధానం చెబుతారు?

### అర్బన్ నక్సల్స్ తోనే అసలు సమస్య

నక్సల్స్ గురించి సానుభూతి మాటలు చెబుతూ.. వారికి మద్దతుగా సిటీల్లో ఉంటూ బతికేవారిది లగ్జరీ లైఫ్. వారి ఇళ్లలో నాలుగైదుఏసీలు ఉంటాయి. ప్రతి గది చల్లగా ఉంటుంది. ఇంట్లోనూ చెప్పులతోనే నడుస్తారు. కాలు కింద పెట్టరు. కానీ వారు ఇతరులు..యువత అడవుల బాటపట్టడానికి రెచ్చగొట్టేలా కవితలు, కథలు, ప్రసంగాలు ఇస్తారు. తిరుగుబాటే శరణ్యమంటారు. అలాంటి వారి వల్ల సమాజానికి, యువతకు ముప్పు వస్తుంది. ముందు వీరిని కంట్రోల్ చేయకపోతే చాలా సమస్యలు వస్తాయి. అందుకే ఎన్ఐఏ సీరియస్ గా తీసుకుంది.



## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

టేక్మాల్, నవతరం: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం... ఎలకుర్తి శేరిపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చాలనే బీజేపీ ప్రభుత్వ కుట్రపూరిత ఆలోచనను వెంటనే వెనక్కు తీసుకోవాలని, ఆ పథకాన్ని “మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం” గానే కొనసాగించాలని ఎలకుర్తి శేరిపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీ గట్టిగా డిమాండ్ చేసింది. లేని పక్షంలో గ్రామం నుంచి మండలం, మండలం నుంచి జిల్లా, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీజేపీ ప్రభుత్వంపై ఉధృత నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవ ప్రసాద్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, ఉప సర్పంచ్ కందిపల్లి నవీన్ కుమార్, యూత్ అధ్యక్షుడు చాకలి మల్లేష్, రవీందర్ రెడ్డి, మానయ్య, జగదీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జై శ్రీరామ్‌నగర్‌లో కుక్కకాటు కలకలం

**ఫిర్యాదులు చేసిన పట్టించుకోని జీహెచ్ఎంసి అధికారులు**

**సూరారంలో శునకాల స్వైర విహారం**

**ఐదేళ్ల బాలుడిని గాయపరిచిన వీధి కుక్కలు**

**గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలింపు**

**వీధి కుక్కల సమస్యను పట్టించుకోని సిబ్బంది**

**అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆందోళన**





కుత్బుల్లాపూర్, నవతరం: పిల్లల ప్రాణాలతో కుక్కల చెలగాటం.. పట్టించుకొని పాలకుల శునకానందంగా హైదరాబాద్ మహానగరంలో కుక్కల స్వైరవిహారం నిదర్శనంగా నిలుస్తుంది. మహానగరం పురపాలక జోన్లు, డివిజన్ల విభజనలతో రాజకీయ లబ్ధి పొందే చర్యలు తప్ప నగర వాసులను సంరక్షించే చర్యలు ఏ మాత్రం ఎక్కడా కానరావడం లేదు. ఓ వైపు బస్తీలలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, వీధులు పేరుకుపోతున్న చెత్తా చెదారంకు తోడు వీధులలో గుంపులు గుంపులుగా స్వేచ్ఛ స్వైర విహారం చేస్తున్న శునకానందంగా వీదికుక్కల దాడులతో జనం సతమతమవుతున్నా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు అధికారయంత్రాంగానికి ఏమాత్రం కనువిప్పుకావడం లేదు. కనీసం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన పురపాలక యంత్రాంగం వీధి కుక్కలను కట్టడి చేయాలని వినతులను కూడా పట్టించుకోకుండా వ్యవహరిస్తుండటంతో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ పిల్లలు పెద్దలు తేడా లేకుండా కాటు వేసి గాయపరుస్తున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి.

**ఐదేళ్ల బాలుడిని గాయపరిచిన వీధి కుక్కలు**

కుత్బుల్లాపూర్ జోన్ సాయిబాబ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో ఆదివారం జై శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఎల్.కే.జీ. విద్యార్థి ఐదేళ్ల అభిలాష్ అనే బాలుడిపై వీది కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన అధికారులు సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. హుటాహుటిన బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంతోనే కుక్కల దాడులు**

కుత్బుల్లాపూర్ జోన్ సాయిబాబ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ జై శ్రీరామ్ నగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి కుక్కల సమస్య విపరీతంగా మారింది. వీధులలో బయటకు వెళ్లాలంటేనే జనం భయంతో వణికిపోతున్నామని, కుక్కలను పట్టుకునేందుకు పురపాలక యంత్రాంగం ఏర్పాటు చేసిన ఎనిమల్ ట్రాకర్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీలో కుక్కలు పిల్లలు పెద్దలపై దాడులు చేస్తున్నాయని పలుమార్లు ఫిర్యాదులు చేసినా కూడా కనీసం స్పందించకపోవడంతో కుక్కల సమస్య కంటిమీద కునుకులేకుండా చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పదే పదే ఫిర్యాదులు చేసినా ఏ ఒక్క రోజు కూడా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రేటర్ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి

**జీవో 252 ను సవరించాలని విజ్ఞప్తి చేసిన టియుడబ్ల్యూజె - ఐజేయు ప్రతినిధి బృందం**

**సానుకూలంగా స్పందించిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, నవతరం: అక్రిడిటేషన్ ల కోసం నూతనంగా విడుదలైన జీవో 252 లో మండలానికి ఒక్క అక్రిడిటేషన్ నిబంధనతో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు ఆందోళకు గురికావాల్సిన అవసరం లేదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన జీవో లో మండలానికి ఒక్క కార్డు నిబంధన వల్ల గ్రేటర్ పరిధిలో అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ దృష్టి కి ఆదివారం తీసుకెళ్లడం జరిగింది. టి యు డబ్ల్యూ జె - ఐజేయు హెచ్ యూ జె, మేడ్చల్, రంగారెడ్డి, జిల్లా ల ప్రతినిధుల బృందం ఈ మేరకు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో కనీసం ముగ్గురు నుంచి నలుగురు విలేకరులు పనిచేస్తున్నారని ఒకటే కార్డు విధానం తో మిగిలిన వారికి నష్టం జరుగుతుందని వివరించారు. గతంలో మాదిరి గ పనిచేస్తూన్న వారికి కార్డులు వచ్చేలా జీవో ను సవరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇందుకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామని తెలిపారు. తన దృష్టి కి వచ్చిన వాటిని పరిశీలించి ఖచ్చితంగా సవరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, హెచ్ యు జె అధ్యక్షులు శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో మహంకాళికి ఘన సన్మానం

**జిల్లా ఉపసర్పంచుల అధ్యక్షునిగా మహంకాళి రామారావు ముదిరాజ్ ఎన్నికపై హర్షం**



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 28,నవతరం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మహంకాళి రామారావు నియామకంపై పినపాక నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు లావడ్య రాములు నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బీసీ వర్గ ముద్దుబిడ్డ ఇరవెండి గ్రామ పంచాయతీకి చెందిన మహంకాళి రామారావును అధికారికంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీసీ సంఘం అభివృద్ధి కొరకు అహర్నిశలు పాటుపడే వ్యక్తిత్వం ఉన్న రామారావు జిల్లా ఉప సర్పంచుల సంగం అధ్యక్షులుగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై రాజకీయ రంగంలో పదోన్నతులు సాధించి బిసి వర్గ అభివృద్ధికి తోడ్పడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉప సర్పంచుల బలోపేతం చేయడంతో పాటు బీసీ వర్గ అభివృద్ధికి తోడ్పడాలని కార్యాచరణ అమలులో క్రియాశీలకంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఉపాధ్యక్షుడు మెండే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజ్జంకి కనకచారి, నియోజకవర్గ అధ్యక్షులు నిదానపల్లి బాలకృష్ణ, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు వారాల వేణు,బూర్గంపహాడ్ మండల బీసీ సంఘం అధ్యక్షులు దాసరి సాంబ, ఉపాధ్యక్షులు చిప్పా రాజు, మండల కార్యదర్శి మండల కార్యదర్శి నరసింహారావు,వట్టికొండ రామకృష్ణ,విద్యార్థి సంఘం నాయకులు జక్కుల సందీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# సానుకూల నిర్ణయం తీసుకుంటాం

**బీసీ సంక్షేమ మరియు వెనుకబడిన తరగతుల శాఖమంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, నవతరం: ముదిరాజు సామాజిక వర్గం చిరకాల వాంఛ, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ముదిరాజులను బీసీ ఏ లో చేర్చేదానిని సానుకూల నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం రోడ్డు రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ముదిరాజ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ సమన్వయ కమిటీ సభ్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ను హైదరాబాదులోని మంత్రుల నివాసంలో శనివారం ఉదయం కలిసి ముదిరాజులు పడుతున్న ఇబ్బందులను బాధలను వివరించడం జరిగింది. బీసీ ఏ అంశాన్ని త్వరలో ముఖ్యమంత్రి కి వివరించి మంత్రివర్గంలో కూడా చర్చించి సానుకూలంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో సమన్వయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ సమన్వయ కమిటీ సభ్యులు, డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, గౌడుగు శ్రీనివాస్ ముదిరాజ్, అల్లుడు జగన్ ముదిరాజ్, డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్, డాక్టర్ రెడ్డబోయిన వినోద్ కుమార్ ముదిరాజ్, ఆగం పాండు ముదిరాజ్, దుస్స వెంకటేష్ ముదిరాజ్, భీమ లక్ష్మణ్ ముదిరాజ్, బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, పుట్టి రాజు ముదిరాజ్, కోట్ల పుష్పలత ముదిరాజ్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో యుద్ధ విమానాల తయారీ.. టీఎల్ఎంఏఎల్ భారీ ప్లాన్!



భాగ్యనగరం త్వరలోనే భారీ రవాణా విమానాల తయారీ కేంద్రంగా (ఏరోస్పేస్ హబ్) మారబోతోంది. భారత వాయుసేన (ఐఏఎఫ్) తన అవసరాల కోసం 80 కొత్త సరుకు రవాణా విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించడంతో, అంతర్జాతీయ దిగ్గజం లాక్‌హీడ్ మార్టిన్ తన 'సీ-130జే సూపర్ హెర్క్యులస్' విమానాలను హైదరాబాద్‌లోనే తయారు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. ప్రస్తుతం ఈ విమానాలకు సంబంధించిన తోక భాగాలను హైదరాబాద్‌లోని 'టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్' యూనిట్‌లో తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు 250 యూనిట్లను అమెరికాకు పంపారు. వాయుసేనతో ఒప్పందం ఖరారైతే, అమెరికా వెలుపల ఈ విమానాలను పూర్తిస్థాయిలో తయారు చేసే ఏకైక కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుంది. ఈ విమానం కేవలం సరుకు రవాణాకే కాకుండా యుద్ధ క్షేత్రంలోనూ కీలక పాత్ర పోషించగలదు. కొత్త వేరియంట్లలో ఆరు ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో కూడిన 'డిస్ట్రిబ్యూషన్ అపెర్చర్ సిస్టమ్' (డీఏఎస్) ఉంటుంది, ఇది పైలట్లకు రాత్రిపూట స్పష్టమైన దృశ్యాలను అందిస్తుంది. అలాగే క్షిపణి హెచ్చరిక వ్యవస్థ దీని అదనపు ఆకర్షణ. ఈ ఒప్పందం కుదిరితే హైదరాబాద్ నుంచి విదేశాలకు కూడా ఈ యుద్ధ విమానాలను ఎగుమతి చేసే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



## ఐక్యతకు పునాది కోటబొమ్మాలిలో తెలగ కుల ఆత్మీయ కలయిక

నవతరం: కోటబొమ్మాలి,(శ్రీకాకుళం) : కులంలో ఉన్న అందరినీ ఒక్కటిగా కట్టిపడేసే శక్తి ఆత్మీయ కలయికకేఉందని పలువురు తెలగ సంఘం నేతలు పేర్కొన్నారు. ఆది వారం కోటబొమ్మాలిలో తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన (ఆత్మీయ సమ్మేళనం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగ కుల పెద్దలు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలగ కులస్తుల మధ్య ఐక్యత మరింత బలపడటంతో పాటు సమిష్టి అభివృద్ధికి, కుల సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేయవచ్చని అన్నారు. వెనుకబడిన కులాన్ని ముందుకు నడిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని, రాజకీయంగా మరియు సామాజికంగా బలపడేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల ప్రముఖులు పల్లంట్ల వెంకట రామారావు, రొక్కం మధుబాబు, నాళ్ల ఆదినారాయణ, (చిన్ని) దాసరి మోహన్‌రావు, రొక్కం రమేష్, దాసరి లక్ష్మణరావు, లాలిసెట్టి గోవిందరావు, ఎర్నాగుల వాసుదేవరావు, మండపాక నర్సింగరావు, గొంటి నాగభూషణరావు, నాళ్ల ప్రకాశరావు, రొక్కం నీలకంఠేశ్వరరావు తెలగ కుటుంబీకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇటువంటి సామాజిక కుటుంబీకులు అందరూ ఒక చోట చేరి ఆప్యాయతగా ఒకరు ఒకరు కలుసుకొని మాట్లాడి మంచి చెడులను చర్చించుకోవడం ద్వారా సంబంధిత సామాజిక వర్గంలోని వ్యక్తుల సమస్యలను వారి అభిప్రాయాలను తెలుసు కోగలగడంజరుగుతుందని వక్తలు పేర్కొన్నారు.



## ప్రజావేదికగా శేరిలింగంపల్లి డివిజన్ కార్యాలయం

**::: శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

శేరిలింగంపల్లి, నవతరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటైన శేరిలింగంపల్లి డివిజన్ కార్యాలయం ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా నిలుస్తుందని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. నూతన హంగులతో ఏర్పాటైన డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు నిర్వహించి పిఏసీ ఛైర్మెన్, నియోజకవర్గ ఎంఎల్ఏ అరికెపూడి గాంధీ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు అయిన ప్రజా వేదిక నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని సమస్యల పరిష్కార దశగా పనిచేస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దరమే లక్ష్యమన్నారు. డివిజన్ పునర్విభజనతో మరింత బాధ్యత పెరిగిందని.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## దుప్పట్లు పంపిణీ చేసిన భిక్షపతి యాదవ్

శేరిలింగంపల్లి, నవతరం: బతుకు తెరువు కోసం వలస వచ్చిన కూలీలకు, బిక్షాటన చేస్తూ రోడ్లపై నివసిస్తున్న వారికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు మాజీ శాసనసభ్యులు, ట్రస్ట్ చైర్మన్ బిక్షపతి యాదవ్. మానవసేవే మాధవసేవ అంటూ నిత్యం ఏదో ఒక సామాజిక సేవ చేస్తూ ప్రజలకు అండగా ఉంటున్న సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బిక్షపతి యాదవ్ నల్లగండ్ల పరిసర ప్రాంతాలలో వలస కూలీలకు, బిక్షాటన చేస్తూ రోడ్లపై నివసిస్తున్న పేదవారికి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితిలో ఉన్నటువంటి పేద ప్రజలు తీవ్రమైన చలి నుండి రక్షించుకోవడానికి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలుపుతూ, ప్రతి ఒక్కరు కూడా తమకు తోచిన విధంగా సమాజ సేవ చేస్తూ పేదవారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్ కార్పొరేటర్ ఎల్లేష్, వసంత్ యాదవ్, కిషోర్ ముదిరాజ్, సురేష్, ప్రభాకర్, సతీష్, ఫారూఖ్, మరియా తదితరులు పాల్గొన్నారు.

## మోత రోహిత్ ముదిరాజ్ కి శుభాకాంక్షలు

**తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



హైదరాబాద్, డిసెంబర్ 28,నవతరం : తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదివారం ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మోత రోహిత్ ముదిరాజ్ కి శాలువా తో సత్కరించి పులగుచ్చం అందించి శు భాకాంక్షలు తెలియచేశారు.

# కురుమ సంఘం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తా

## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కోలన్ హనుమంత్‌రెడ్డి



కుత్బుల్లాపూర్, నవతరం: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డి ని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ లోని తన కార్యాలయంలో "కుత్బుల్లాపూర్ కురుమ సంఘం" నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సభ్యులను కొలన్ హనుమంత్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి సంఘం అభివృద్ధి, సంఘానికి సంబంధించిన సమస్యలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కురుమ సంఘం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని కొలన్ హనుమంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కురుమ సంఘం ఇంచార్జ్ బట్ట పాలకృష్ణ కురుమ, చైర్మన్ బట్ట నరసింహ కురుమ, వైస్ చైర్మన్ జి. బాలరాజ్ కురుమ, అధ్యక్షులు నార్లకంటి బాలయ్య కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి కురుమ, వైస్ ప్రెసిడెంట్ వై యాదగిరి కురుమ, పి మహేందర్ కురుమ, కె.అంజయ్య కురుమ, నార్లకంటి పెంటయ్య కురుమ, నార్లకంటి దుర్గయ్య కురుమ, సర్వోజీ సత్తయ్య, ఉల్పి సత్తయ్య కురుమ, ఉల్పి వెంకటేష్ కురుమ, నార్లకంటి రమేష్ కురుమ, నార్లకంటి కుమార్ కురుమ, ఏ.కె. శ్రీశైలం కురుమ, నరేష్ కురుమ, సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.



## సెలూన్ ప్రారంభించిన కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 277 డివిజన్ మహాదేవపురం పరిధిలోని రాంకీ సెంటర్ లో కుంభం జ్యోతి రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసుకున్న జావీద్ హబీబ్ హెయిర్ సెలూన్, బ్రిడల్ స్టూడియోని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ కార్యక్రమం లో సిద్దనోల సంజీవరెడ్డి, సతీష్ బాబు, మైసిగారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## విధులలో అలసత్వం వహించే అధికార సిబ్బందిపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాచలం 28 డిసెంబర్, నవతరం : దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించనున్న ముక్కోటి %-% వైకుంఠ ఏకాదశి మహో త్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అలాగే అధికారులు తమకు కేటాయిం చిన విధులను సక్రమంగా నిర్వహించాలని విధులలో అలసత్వం వహించే అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఆదివారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సబ్ కలెక్టర్ చాంబర్లో వివిధ శాఖల అధికారులతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం మరియు ఉత్తర ద్వార దర్శనం విధులలో చేపట్టవలసిన కార్యాచరణపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలుసూచనలు ఇస్తూ ముక్కోటి ఏకాదశిని పురస్క రించుకుని భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడ్డాయని,ఆలయ ప్రాంగణం మొత్తం చలువ పందిళ్లు, మామిడ తోరణాలు, పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించగా, భక్తిశ్రద్ధలతో నిండిన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని,కరకట్ట, రామాలయ పరిసర ప్రాంతాలు, సూపర్‌బజార్ సెంటర్, బ్రిడ్జి పాయింట్‌లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు భక్తులను ఆకట్టు కుంటున్నాయని అన్నారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా భద్రాద్రి శ్రీ సీతా రామచంద్ర స్వామి తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారని,ప్రతి రోజు స్వామివారి అవతార దర్శనం భక్తుల్లో భక్తిశ్రద్ధలను మరింత పెంచుతూ అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 29వ తేదీ సాయంత్రం గోదావరి తీరంలో నిర్వహించనున్న తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేశారని, గోదావరి నదిలో హంస వాహనంపై భద్రాద్రి సీతారామచంద్ర స్వామి విహారం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుందని అన్నారు. అనంతరం 30వ తేదీ తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు స్వామివారు ఉత్తర ద్వారం (వైకుంఠ ద్వారం) ద్వారా వైకుంఠ రాముడిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రాంతాలను సెక్టార్లుగా విభజించి, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా చర్యలు, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భద్రాచలానికి విచ్చేసే భక్తులు భద్రాద్రి రాముడి దర్శనంతో పాటు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించాలని ఆయన సూచించారు. గోదావరి నదిలో ఏర్పాటు చేసిన బోటింగ్ సౌకర్యం, గోదావరి ఘాట్ల సహజ సౌందర్యం, నది ఒడ్డున ఏర్పాటు చేసిన గుడారాలలో రాత్రి బస సదుపాయాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని ఆయన అన్నారు. అలాగే ఐటీడీఏ గిరిజన మ్యూజియం, బొజ్జికుప్ప %-% బెండలంపాడు ట్రెక్కింగ్, కిన్నెరసాని పరివాహక ప్రాంతాల సహజ అందాలు భక్తులు, పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ పర్యాటక, సాంస్కృతిక ఏర్పాట్లలో ఎక్కువ భాగం మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించడం జరిగిందని, దీని ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. భక్తులు దర్శనం అనంతరం క్రమశిక్షణ పాటిస్తూ, అధికారులు సూచించిన మార్గాల్లోనే ప్రయాణిస్తూ, శాంతియుతంగా ఉత్సవాల్లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముక్కోటి - వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు భద్రాద్రిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, భక్తులకు మరపురాని అనుభూతిని కలిగించేలా నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తరద్వారా దర్శనం జరిగే ప్రదేశంలో వివిఐపి, విఐపి మరియు మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు సెక్టార్లలో కేటాయించబడ్డ అధికారులు వారిని మాత్రమే సెక్టార్లలోకి అనుమతించాలని, ప్రముఖులతో పాటు భక్తులకు ఎవరికి ఇబ్బందులు కలగకుండా శాఖల వారీగా అప్పగించిన విధులు మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు, ముఖ్యమైనచోట్ల అగ్నిమాపక శకటాలు, ప్రజలకు భక్తులకు తెలిసే విధంగా సమాచార కేంద్రాలు, శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని స్వామివారి తెప్పోత్సవం ఉత్తర ద్వార దర్శనం విజయవంతమయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మ్రిణాళి శ్రేష్ట, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ మురళి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరిన శంక్రాపూర్ యువకులు

బోథ్, నవతరం: నేరడిగొండ మండలం శంక్రాపూర్ గ్రామానికి చెందిన యువకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేడు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ స్వగ్రామంలో ఈ చేరికలు జరిగాయి ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతో ఉందని, యువతకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. యువకులే రేపటి భవిష్యత్తు అని, వారి శక్తిని సద్వినియోగం చేసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులకు ఆడే గజేందర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఆడే రమేష్, సురేష్, రాథోడ్ బాబూలాల్, రాథోడ్ ఇందల్, జాదవ్ దినేష్, జాదవ్ కల్యాణ్, ఆడే మహేందర్, రాథోడ్ శ్రీను, పవర్ మంగులాల్, జాదవ్ మహేష్, పవర్ నితిన్, జాదవ్ కిరణ్, పవర్ చందూలాల్, జాదవ్ శ్రీకాంత్, రాథోడ్ బాబు సింగ్, చౌహాన్ సురేష్, రాథోడ్ క్రిష్ణ, రాథోడ్ అనుకుమార్, రాథోడ్ చరణ్, చౌహాన్ రవీందర్, రాథోడ్ అంకుష్, రాథోడ్ అమర్ సింగ్, పవర్ మహేష్, జాదవ్ మధు తదితరులు ఉన్నారు. ఈ యువకుల చేరికతో నేరడిగొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## నేరడిగొండ మండలంలో బీఆర్ఎస్‌కు షాక్

### ::: కాంగ్రెస్‌లోకి ఆరేపల్లి గ్రామస్తుల భారీగా చేరిక

ఆదిలాబాద్, నవతరం: నేరడిగొండ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేడు నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో ఆరేపల్లి గ్రామస్తులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి ఆడే గజేందర్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో ఆడే శ్రీను, శ్రీరామ్, అర్జున్, బలిరాం, కుమార్, జాదవ్ శేఖర్, రాథోడ్ గోవింద్ రావు, సిడం జైతు, గెడం రాజేష్, కుమ్రా మాణిక్ రావు, పురుషోత్తం, లక్ష్మణ్, పద్రం దిగంబర్,మాడావి సురేష్, సిడం దేవురవు, దుర్వ సోనారావు, కిష్టు, విశ్వనాథ్, దేవురవు, భీమ్రావు, ఉయిక లక్ష్మణ్,మనోహర్, మాడావి భూమన్న, మల్కు, తులసీరాం, నాగోరావు, మాణిక్ రావు, శంకర్,యాదవ్ రావు, అజంతా రావు, రాము, అశోక్, నాగేష్, రాములు, దేవురావు, శివాజీ, భీం రావు, జల్పాత్, భీర్సబ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికార పార్టీలో ఉండటం ద్వారానే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధికి సహకరించండి

### ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను కలిసిన సిరిపురం సర్పంచ్

ఖమ్మం, డిసెంబర్ 28,నవతరం: ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను ఆదివారం వైరా మండలం సిరిపురం గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిపురం గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కోరారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధిలో ముందుకు నడుపుతానని ఆయన అన్నారు. మార్క్ ఫైడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కామినేని శ్రీనివాసరావు, పర్చూరి రామారావు ,అయినాల కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఏరు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులు, ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

- నవతరం, భద్రాచలం



## గ్రామీణ వైద్యం లో ఆర్ఎంపిలది ప్రముఖ పాత్ర : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతరం, అశ్వారావుపేట : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయడంలో ఆర్ ఎం పి వైద్యులు ప్రముఖ పోషిస్తున్నారని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు.ఆదివారం వినాయకపురం లోని చిలకల గండి ముత్యాలమ్మ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన ఆర్ ఎం పి డబ్ల్యు ఏ మండల సమావేశం లో ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ ఎం పి లు తమ పరిధులు దాటి వైద్యం చేయవద్దని, ఆర్ ఎం పి ల విషయాన్ని అసెంబ్లీ లో చర్చిస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది ప్రాణాలు కాపాడేది ఆర్ ఎం పి లేని అన్నారు. తనకు విద్య, వైద్యం అంటే చాల మక్కువ అని మొదటి ప్రాధాన్యత వాటికే అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఎం పి డబ్ల్యూ ఏ జిల్లా అధ్యక్షులు కొమరయ్య, రామ్మూర్తి, రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మెన్ సుంకవల్లి7 వీరభద్ర రావు, గ్రామీణ ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.




## ఘనంగా కాంగ్రెస్ పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం

### ఊట్లపల్లి కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు

### ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

నవతరం, అశ్వారావుపేట : అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ మరియు అశ్వారావుపేట మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఊట్లపల్లి ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పార్టీ జెండాను ఎగరవేసిన కాంగ్రెస్ పార్టీ ఊట్లపల్లి గ్రామ నాయకులు.ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు కొవ్వాసి దుర్గారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పని చేస్తోందని రైతులు కూలీలు మహిళలు యువతకు మేలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ఉండాలంటే ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ చేసిన మంచి పనులు చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ సత్యం లక్ష్మీ కుమారి, ఉప సర్పంచ్ సాదు జోషి, వార్డ్ సభ్యులు అంజిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం రామకృష్ణ, సోయం శ్రీను, బేతి పుల్లారావు, తెల్లం రాము, కొర్రి వెంకటేశ్వరరావు, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నృత్య ప్రదర్శన



భద్రాచలం, డిసెంబర్ 28,నవతరం: భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు కుమార్తె రిషిత ఏరు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. శాస్త్రీయ నృత్య శైలిలో ఆమె ప్రదర్శించిన అభినయం, లయబద్ధమైన అడుగులు, భావవ్యక్తీకరణ కార్యక్రమానికి ప్రత్యేక వన్నె తెచ్చాయి.

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com